సాక్షి అనకాపల్లి

మంగళవారం ♦ 28 ♦ నవంబర్ ♦ 2023



సత్వర పరిష్కారం

కలెక్టరేట్ స్పందనకు 301 వినతులు వచ్చాయి. అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



ఎన్ఎస్ఎస్ శిబిరానికి ఎంపిక

విశాఖ: పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ సమైక్య శిబిరానికి ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు.




వంజంగి హిల్స్ రోడ్డు విస్తరణ

సాక్షి,పాడేరు: వంజంగి హిల్స్‌లోని కంబాలు బయలుకు వెళ్లే మట్టిరోడ్డు విస్తరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

మార్మోగిన శివ పంచాక్షరి



పుష్పాలంకరణలో పాకలపాడు గురుదేవుల సమాధి

నర్సీపట్నం: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా బలిఘట్టం ఉత్తరవాహినిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక, అభిషేకాలు చేశారు. నర్సీపట్నం, పెద బొడ్డేపల్లి శివాలయాల వద్ద కోలాహలం నెలకొంది. ఉత్తరవాహినిలో వేంచేసిన పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. గురుదేవుల ఆశ్రమంలో జరిగిన పౌర్ణమి పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం గురుదేవులను భక్తులు దర్శించుకున్నారు.

ఉపమాక వెంకన్న సేవలో డిప్యూటీ కమిషనర్



ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న డీసీ సుజాత

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారిని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత సోమవారం దర్శించుకున్నారు. ఇక్కడ బేడామండపం చుట్టు ప్రదక్షిణలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామిని, ఆండాళ్లమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు, దేవస్థాన సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. అర్చక స్వాములు ఆమె గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనకమహాలక్ష్మికి బంగారు ఆభరణాల వితరణ



ఆలయ ఈవోకు బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన మంత్రినీత గణపతి, కుటుంబ సభ్యులు బురుజుపేట కనకమహాలక్ష్మికి సోమవారం బంగారు ఆభరణాలు బహూకరించారు. 67 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు గొలుసు, ఒక తెల్లరాళ్ల బంగారు మామిడి పిందెల నెక్లెస్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీషకు అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఎం.ధనలత, బి.అనురాధ, ఎస్.సతీష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు



గరికిపాటి

మల్కాపురం: తల్లిదండ్రులను మించిన దైవం లేదు.. వారిని గౌరవించి ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రవచన కర్త, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. మల్కాపురం, ప్రకాష్‌నగర్‌లో స్ఫూర్తి టీమ్ ఆధ్వర్యంలో గరికపాటి ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కార్తీకమాస విశిష్టతను తెలియజెప్పారు. అనంతరం విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దని, తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మనసు ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలన్నారు. దైవారాధన, తల్లిదండ్రుల సేవను యువత విస్మరించవద్దన్నారు.

10న మిస్టర్ విశాఖ బాడీబిల్డింగ్ పోటీలు

పెదగంట్యాడ: వచ్చే నెల 10న విశాఖ నగరంలోని మర్రిపాలెం కరాసలో 2వ మిస్టర్ విశాఖ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నామని విశాఖ బాడీబిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సవలాపురపు రాజారావు తెలిపారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను పెదగంట్యాడలోని ఆర్కే ఫిట్‌నెస్ జిమ్ ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కే ఫిట్‌నెస్ జిమ్ అధినేత ఆర్కే గున్న ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు చాంపియన్ ఆఫ్ చాంపియన్ పేరుతో బంగారు పతకాలు అందజేయనున్నామని తెలిపారు.



ఉత్సవమూర్తులకు నక్షత్ర హారతి అందజేస్తున్న అర్చకుడు, తిలకిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి



వరాహ పుష్కరిణి వద్ద వేదికలపై నిలబడి నక్షత్ర హారతులు ఇస్తున్న అర్చకులు



వరాహ నారసింహ, ప్రహ్లాదుని వేషధారణలో భక్తులు

పుణ్యనదీ హారతితో ఆధ్యాత్మిక కాంతులు

- సింహాచలేశుని వరాహ పుష్కరిణిలో విశేష కార్యక్రమం
- ఎనిమిది మంది అర్చకులతో నక్షత్ర హారతి
- పరవశించిన భక్తజనం.. పాల్గొన్న శారదా పీఠాధిపతి

సింహాచలం: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం సాయంత్రం వరాహ పుష్కరిణికి జరిగిన పుణ్యనదీ హారతి (గంగా హారతి) కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఎనిమిది మంది అర్చకులు ఒకేసారి వరాహ పుష్కరిణికి ఇచ్చిన హారతిని చూసి పరవశించారు. భక్తులు పుష్కరిణి గట్టుపై పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. కోలాటం, నృత్యాలు, సంకీర్తనలతో స్వామిని కొలిచారు. ముందుగా సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వెంకన్న ఉత్సవమూర్తులను సాయంత్రం 5 గంటలకు తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం ద్వయ హారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతి స్వామికి సమర్పించారు. తర్వాత ఎనిమిది మంది అర్చకులు పుష్కరిణికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఎనిమిది వేదికలపై నిలబడి.. వరాహ పుష్కరిణికి నక్షత్ర హారతులు ఇచ్చారు. అనంతరం పుష్కరిణి గట్టుపై మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకుని నదీ హారతిని తిలకించారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా విశేష ఏర్పాట్లు చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్రీడా సంబరం

- 15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'
- రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం
- గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే ప్రయత్నం
- యువతీ యువకులకు చక్కని అవకాశం

నక్కపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు.. యువతీ యువకులు ఆటల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో బృహత్తర ప్రయత్నం చేస్తోంది. డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 తేదీ వరకు నిర్వహించే ఈ క్రీడా పోటీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో నిర్వహించే ఈ పోటీల్లో 15 ఏళ్లు నిండిన యువతీ యువకులు పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను కనుగొని వారిని పెద్ద పెద్ద వేదికలకు పరిచయం చేయడం, క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు వివిధ ఆటల్లో రాణిస్తున్నారు. గుర్తించే వారు లేక వారి ప్రతిభ అడవి కాచిన వెన్నెలలా మిగిలిపోతోంది. అటువంటి ప్రయత్నం ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయలేదు. కేవలం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఆటల పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అయితే ఎటువంటి అర్హత, ప్రామాణికాలతో నిమిత్తం లేకుండా 15 ఏళ్లు నిండిన ఉత్సాహవంతులంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. స్థానిక పాఠశాలలు, సచివాలయాలు, 1902 టోల్ ఫ్రీ నంబర్, ఆన్‌లైన్, మండల పరిషత్ కార్యాలయం, వలంటీర్ల ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

విజేతలకు భారీ నగదు బహుమతులు

విజేతలకు ప్రభుత్వం భారీగా ప్రైజ్‌మనీ ప్రకటించింది. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.35 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయానికి రూ.30 వేలు, తృతీయానికి రూ.10 వేలు.. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయం రూ.3 లక్షలు, తృతీయం రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఇక బ్యాడ్మింటన్ డబుల్స్‌కు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ రూ.5 వేలు.. జిల్లా స్థాయికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.20 వేలు, తృతీయ రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ లక్ష రూపాయలు, తృతీయ రూ.50 వేలను ప్రైజ్ మనీగా అందించనున్నారు. సచివాలయాల్లో 'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని, నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వలంటీర్లకు, పీఈటీలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'

పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తదితరులు

తుమ్మపాల: వచ్చే నెల 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ వరకు 51 రోజులపాటు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు సంబరంగా నిర్వహించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన 'ఆడుదాం ఆంధ్రా' వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్రంలో 15 ఏళ్లు దాటిన యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతోపాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకునేందుకు ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 51 రోజుల పాటు జిల్లాలో 572 గ్రామ/వార్డు సచివాలయాలు, 24 మండలాలు, 7 నియోజకవర్గాలు, ఆపై జిల్లా స్థాయిలో నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు అందజేస్తామన్నారు. అనకాపల్లిలో వచ్చే నెల 15 నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 3వ తేదీన విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి సంబరాలతో ముగుస్తాయని తెలిపారు. క్రీడా మైదానాలు, స్టేడియాలు సంసిద్ధం చేశామన్నారు. ఐదు క్రీడాంశాలకు కావలసిన సామగ్రిని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సచివాలయాలకు అందిస్తుందన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 15 ఏళ్లు పైబడిన యువతీ యువకులు సమీప సచివాలయంలో పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. aadudamandhra.ap.gov.in లాగిన్‌లో రిజిస్టర్ కోసం 1902 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా క్రీడాధికారి వేణుగోపాల్, డీఆర్వో బి.దయానిధి, గ్రామ/వార్డు సచివాలయాల (జి.ఎస్.వి.ఎస్) ప్రత్యేక అధికారి మంజులవాణి, జెడ్పీ సీఈవో పోలినాయుడు, డ్వామా పీడీ సందీప్ పాల్గొన్నారు.

పర్యాటకులతో వాడ్రాపల్లి ఆవ కళకళ



వాడ్రాపల్లి ఆవలో బోటు షికారు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి ఆవ పర్యాటకులతో కళకళలాడింది. కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో భక్తులు శివాలయాలను దర్శించుకున్నారు. దీనిలో భాగంగా వాడ్రపల్లిలోని పుణ్యక్షేత్రమైన దక్షిణేశ్వరున్ని దర్శించుకొని సమీపంలోని ఆవలో బోటు షికారు చేసి సందడి చేశారు. ఆవలోని నీటిలో తేలియాడే శివలింగాన్ని దర్శించుకొని పూజలు చేశారు.

బాలికను వేధించి.. సొమ్ము దోచేసి..

9వ తరగతి విద్యార్థినికి సోషల్ మీడియాలో వేధింపులు

కూర్మన్నపాలెం (విశాఖ): సోషల్ మీడియా వేదికగా 9వ తరగతి చదువుతున్న బాలికను వేధిస్తూ డబ్బులు దోచేసిన వ్యక్తిపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. ఓ టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలిక ఈ నెల 22న స్కూల్‌కి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి.. స్కూల్‌కు వెళ్లకుండా ఎటో వెళ్లిపోయింది. దీంతో ప్రిన్సిపాల్ ఆమె తల్లికి ఫోన్ చేసి.. బాలిక స్కూల్‌కు రాలేదని చెప్పారు. కంగారు పడిన ఆమె స్కూల్‌కి వెళ్లి ఆరా తీసింది. సాయంత్రం వరకు అక్కడే ఉంది. స్కూల్ ముగిసే సమయానికి వచ్చిన బాలికను ఎక్కడకు వెళ్లావని ప్రశ్నించగా.. ఏడుస్తూ ఉండిపోయింది. ఇంటికి తీసుకువెళ్లి ప్రశ్నించగా.. సోషల్ మీడియాలో ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడని చెప్పింది. దీంతో తల్లితో పాటు పాఠశాల సిబ్బంది బాలికను ఫాలో అయ్యారు. తర్వాత రోజు బాలిక ఆటోలో వస్తుండగా.. ఆటోను ఓ కారు ఫాలో అవ్వడం గమనించారు. తర్వాత స్కూల్ పక్కనే ఉన్న వీధిలో బాలిక ఓ వ్యక్తితో మాట్లాడటం గుర్తించి.. గట్టిగా నిలదీశారు. దీంతో బాలిక విస్తుపోయే నిజాలు చెప్పింది. 'మార్చిలో నా స్నేహితురాలి పేరుతో వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. ఓ న్యూడ్ వీడియో పంపి.. నన్ను కూడా అలాగే పంపమని మెసేజ్‌లో ఉంది. నేను అలానే చేశా. రెండు రోజుల తర్వాత స్కూల్‌కి వచ్చి నా ఫ్రెండ్‌ను వీడియో గురించి అడిగాను. తనకు ఏమీ తెలియదని, ఆ నంబర్ కూడా తనది కాదని చెప్పింది. దీంతో అదే రోజు వాట్సాప్‌లో న్యూడ్ వీడియో పెట్టిన వ్యక్తిని ఎవరు మీరు అని ప్రశ్నించాను. అతను నువ్వు నాకు తెలుసు.. లక్ష రూపాయలు ఇస్తే వీడియో డిలీట్ చేస్తాను. లేదంటే వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను అని బెదిరించాడు.' అని వారికి బాలిక చెప్పింది. అతనికి భయపడిన బాలిక దఫదఫాలుగా రూ. 30 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున ఇంట్లో దొంగతనం చేసి బెదిరిస్తున్న వ్యక్తికి ఇచ్చింది. ఇంకా డబ్బులు కావాలని అడుగుతుండడంతో తన దగ్గర లేవని చెప్పింది. అయితే తాను చెప్పినట్లు చేయాలని, తన ఫ్రెండ్‌తో వెళితే వీడియో డిలీట్ చేస్తానని అతను బాలికకు చెప్పాడు. దీంతో ఈ నెల 22న ఉదయం స్కూల్‌కు వెళ్లకుండా యువకుడు చెప్పినట్లుగా ఆ వ్యక్తితో వెళ్లింది. అయినప్పటికీ ఆ వ్యక్తి ఇంకా మూడు లక్షలు తీసుకురావాలని బెదిరిస్తున్నాడని తల్లికి చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన దువ్వాడ పోలీసులు నిందితుడు వెదుళ్లనరవకు చెందిన మాటూరి సాయిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు.

కేజీహెచ్‌లో నకిలీ నియామకాల కలకలం

- సూపరింటెండెంట్ పేరుతో నియామక ఉత్తర్వులు
- షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు నకిలీ ఆర్డర్‌తో కార్యాలయానికి యువకుడి రాక
- ఆ అపాయింట్‌మెంట్ ఆర్డర్ వెనుక సిబ్బంది పాత్ర
- పోలీసులకు ఫిర్యాదు చేయనున్న అధికారులు

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో నకిలీ నియామక ఉత్తర్వుల వ్యవహారం కలకలం సృష్టించింది. షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధించి ఒక మహిళ పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఆస్పత్రిలో సంచలనం రేపింది. కేజీహెచ్‌లో పలు పోస్టులకు వైద్యాధికారులు రెండేళ్లుగా భర్తీ ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటికే మెజార్టీ పోస్టుల నియామకాలు పూర్తి చేశారు. ఇదిలావుండగా షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధించి నియామక పత్రాన్ని ఓ వ్యక్తి కేజీహెచ్ పరిపాలనా విభాగానికి తీసుకొచ్చాడు. ఈ నియామక పత్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ మహిళది. దీనిపై ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అనుమతితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, సంబంధిత గుమస్తా, సెక్షన్ పర్యవేక్షకుడు సంతకం కూడా ఉంది. ఆర్డర్ పొందిన మహిళకు పే స్కేల్ కూడా ఫిక్స్ చేశారు. డిసెంబర్ 15వ తేదీలోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో ఉంది. కేజీహెచ్ సూపరింటెండెంట్, అడిషినల్ డీఎంఈ, డాక్టర్ పి.అశోక్ కుమార్ పేరుతో అపాయింట్‌మెంట్ లేఖలో ఉండడాన్ని సిబ్బంది గమనించారు. సదరు మహిళ రాకుండా వేరే వ్యక్తి ద్వారా నియామక పత్రం తీసుకురావడం, నియామకపత్రంలో పలు అనుమానాలుండడంతో



కేజీహెచ్ సూపరింటెండెంట్ పేరిట నకిలీ ఉత్తర్వుల కాపీ

కేజీహెచ్ పరిపాలన విభాగం సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. నియామకపత్రం నకిలీదని నిర్ధారణకు వచ్చారు. వెంటనే విషయాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు.

మరిన్ని నకిలీ ఆర్డర్లు ఉన్నాయా..?

వైద్య ఆరోగ్య శాఖలో ఇప్పటికే నకిలీ ఆర్డర్ల వ్యవహారం కుదిపేసింది. తాజాగా ఇపుడు కేజీహెచ్‌లో కూడా అదే తరహా ఘటన బయటపడింది. ఈ నేపథ్యంలో మరిన్ని నియామకాల విషయంలో ఇటువంటి నకిలీ ఆర్డర్లు ఉన్నాయా..? అన్నది ప్రస్తుతం కేజీహెచ్‌లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై లోతైన విచారణ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో కేజీహెచ్ అధికారులున్నారు.

కేజీహెచ్ సిబ్బందిపై అనుమానాలు

ఈ నకిలీ ఆర్డర్ వెనుక కేజీహెచ్‌లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు సంబంధం ఉన్నట్టు ఆస్పత్రిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాఖాపరమైన విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేజీహెచ్‌లో ఇటువంటి వ్యవహారాలు ఎన్ని జరిగాయి...? నకిలీ ఉత్తర్వుల వ్యవహారం వెనుక ఎవరెవరున్నారు..? అనే విషయాలపై కేజీహెచ్ అధికారులు దృష్టి సారిస్తున్నారు.



పోస్టింగు ఆర్డర్ తీసుకొచ్చి మేనేజర్‌కు చూపిస్తున్న యువకుడు (ఎరుపు రంగు చొక్కా)

ఇది రెండో ఆర్డర్



సోమవారం తీసుకొచ్చిన నకిలీ నియామక పత్రం రెండోదిగా గుర్తించాం. గతంలో కూడా ఒక వ్యక్తి ఇలా నకిలీ ఆర్డర్ తీసుకొచ్చాడు. ఇప్పుడు మళ్లీ రావడంతో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాం. సంతకాలు, ఫైల్ నంబరు ఒకేలా ఉన్నాయి. దీని వెనుక ఎవరున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు పోస్టింగు ఆర్డర్ బయటకు వచ్చింది. రేపు ఇంకా ఏమైనా చేస్తారా అన్న అనుమానం వుంది.

– డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్, విశాఖ

జూలో విషాదం

- యానిమల్ కీపర్‌పై ఎలుగుబంటి దాడి
- ఎన్‌క్లోజర్‌లోనే యువకుడి మృతి

ఆరిలోవ : విశాఖ జూలో కలకలం రేగింది. ఎలుగుబంటి దాడిలో యానిమల్ కీపర్ నగేష్‌బాబు మృతి చెందాడు. సోమవారం ఉదయం 8 గంటలకు నగేష్ డ్యూటీకి వచ్చాడు. 9 గంటలు సమయంలో ఎలుగుబంటిని డే క్రాల్‌లోకి విడిచిపెట్టడానికి వెళ్లాడు. నైట్ క్రాల్‌లో ఉన్న ఎలుగుబంటిని లిఫ్ట్ డోర్ తెరిచి డే క్రాల్ (సందర్శకులు చూసే ఎన్‌క్లోజరు)లోకి విడిచిపెట్టాడు. మళ్లీ ఆ డోర్ మూయడం మరిచిపోయి నైట్‌క్రాల్‌ను శుభ్రం చేస్తుకొంటున్నాడు. ఆ ఎలుగుబంటి తెరిచి ఉన్న డోర్ ద్వారా డే క్రాల్ నుంచి మళ్లీ నైట్‌క్రాల్‌లోకి ప్రవేశించి నగేష్‌పై దాడిచేయగా అక్కడిక్కడే మృతి చెందాడు.

నిర్లక్ష్యమే కారణమా

జూలో జరిగిన సంఘటనపై ఇది ఎవరి నిర్లక్ష్యమో తెలియని పరిస్థితి నెలకొంది. యానిమల్ కీపర్ నగేష్‌బాబు నిర్లక్ష్యంతో డోర్ మూయకుండా ఉండటం ఒక్కటే కారణమా అనే దానిపై సందర్శకులు నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలుగుబంటి దాడి చేసినప్పుడు సాధారణంగా యానిమల్ కీపర్ కేకలు వేసి ఉంటాడు. అక్కడే అందుబాటులో ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ కేకలు విని వెళ్లాల్సి ఉంది. అయినా సంఘటన జరిగిన గంట తర్వాత డాక్టర్ వచ్చి పిలవమన్నంతవరకు ఆ గార్డు వెళ్లలేదు. ఆ ఎన్‌క్లోజరు కొండ అంచున ఉంది. తోడు లేకుండా ఒక్క కీపర్ మాత్రమే నైట్ క్రాల్‌లోకి వెళ్లి గంటన్నర వరకు తిరిగి రాకపోయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం విశేషం. ఆ సమయంలో అక్కడ బాధ్యతలు చూడాల్సిన జూ అధికారులు ఆచూకీ దరిదాపుల్లో కనిపించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా రేంజర్, సెక్షన్ ఆఫీసర్ ఆ సమయంలో రౌండ్స్ వేస్తూ అన్ని నైట్‌క్రాల్స్, డే క్రాల్స్ పర్యవేక్షించాల్సి ఉంది. ఇదిలా ఉండగా నగేష్ ..భవానీ మాల ధరించారు. ఎలుగుబంటి తిరిగి నైట్‌క్రాల్‌లోకి వచ్చి ఆయన వేసుకొన్న ఎరుపు రంగు బట్టలకు ప్రతిస్పందించి దాడి చేసిందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



యానిమల్ కీపర్ నగేష్ మృతదేహంపై గాయాలు పరిశీలిస్తున్న ఆరిలోవ పోలీసులు, జూ సిబ్బంది

అనుభవంలేని కీపర్..

గతంలో ఇక్కడ ఎలుగుబంటి ఎన్‌క్లోజరు వద్ద అనుభవజ్ఞుడైన యానిమల్ కీపర్‌ను ఏడాదిన్నర క్రితం నిశాచర జీవుల గృహ వద్దకు మార్చేశారు. ఆయన స్థానంలో ఇక్కడ అనుభవంలేని కొత్తగా చేరిన నగేష్‌బాబును నియమించారు. అనుభవం తక్కువ కావడం వల్లే నగేష్‌బాబు తెరిచిన డోరు మూయకుండా నిర్లక్ష్యం వహించాడని సమాచారం.

జూ చరిత్రలో ఇది రెండో సంఘటన..

విశాఖ జూ చరిత్రలో ఇలాంటిది రెండో సంఘటన. సుమారు 20 ఏళ్ల క్రితం ఎలుగుబంటి ఎన్‌క్లోజరులో శుభ్రం చేస్తున్న జూ మహిళా సిబ్బందిపై కూడా దాడి జరిగింది. ఎలుగుబంటి దాడిచేయడంతో ఆ మహిళ మృతి చెందింది. మళ్లీ సోమవారం జరిగిన ఎలుబంటి దాడిలో యానిమల్ కీపర్ మృతి చెందాడు.

బాడీ బిల్డింగ్ పోటీల పేరుతో వసూళ్లు

ఇంటర్నేషనల్ బాడీ బిల్డర్ రవికుమార్ ఆరోపణ



విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

యలమంచిలి (అనకాపల్లి రూరల్): యలమంచిలిలో ఆదివారం రాత్రి బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించిన సంస్థకు గుర్తింపు లేదని, ఈ పోటీల పేరుతో అక్రమ వసూళ్లు చేపట్టారని ఇంటర్నేషనల్ బాడీ బిల్డర్ నిశ్శంకరరావు రవికుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన యలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడారు.గుంటూరుకు చెందిన తాను ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ (ఐబీబీఎఫ్) తరఫున జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆరు మెడల్స్ దేశానికి సంపాదించానని చెప్పారు. యలమంచిలిలో నిర్వహించిన స్టేట్‌మీట్‌కు తనను కూడా ఆహ్వానించారని, కానీ నిర్వాహకులు కుల, ప్రాంతీయ పక్షపాతంతో విన్నర్‌ను ఎంపిక చేశారని ఆరోపించారు. ఇక్కడకు వచ్చిన బాడీ బిల్డర్లకు సరైన భోజనం, వసతి సదుపాయం కూడా కల్పించలేదన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహించే నిర్వాహకుల మాయలో స్పాన్సర్లు పడకూడదని సూచించారు. తనలా ఇంకెవరికీ అన్యాయం జరగకుండా ఉండాలన్నదే తన ఉద్దేశ్యమన్నారు.

జీవీఎంసీకి 96 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పలువురు నుంచి వినతులు స్వీకరించారు. జోన్–2 పరిధి ఇందిరానగర్–1లో అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని పి.వరలక్ష్మి, జోన్–6 పరిధి వుడా ఫేస్–2లో ట్రాఫిక్ ఐల్యాండ్‌లు మరమ్మతులు చేపట్టాలని కాకుల శివకుమార్, జోన్–8 పరిధి శ్రామిక్‌నగర్–3లో మంచినీటి సమస్యపై కొణతాల వెంకట అప్పారావు, జోన్–4 పరిధి చిలకపేటలో మురుగునీటి సమస్యపై వంకా మూర్తి ఫిర్యాదు చేశారు.

ఘనంగా సాంబశివుని శూలాల మహోత్సవం



మునగపాకలో పూజలందుకుంటున్న పార్వతీ పరమేశ్వరులు





ఆకట్టుకున్న శూలాల ప్రదర్శన

మునగపాక: మునగపాక సాంబశివుని శూలాల మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రి ఏర్పాటు చేసిన శూలాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా శూలాలు ధరించిన భక్తులు నృత్యం చేసి తమ శైవభక్తిని చాటుకున్నారు. ఈ ప్రదర్శన ఆలయం నుంచి ప్రారంభమై పలు వీధుల్లో తిరిగి సాంబశివుని ఆలయానికి చేరుకుంది. ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన రెండతస్తుల గుమ్మటం అందరినీ ఆకట్టుకుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, పాలకవర్గం తగు చర్యలు తీసుకుంది.

గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు అందరినీ అలరించాయి. ఉత్సవం సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్ అలీ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

కారు టైరు పేలి..మూడు వాహనాలకు ప్రమాదం



టైరు పేలి ఢీకొన్న కార్లు



పక్కరోడ్డులోనికి దూసుకు వెళ్లి లారీని ఢీకొన్న వ్యాను

ఎస్.రాయవరం: పి.ధర్మవరం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం కారు టైర్లు పేలి రోడ్డుకి అడ్డంగా ఆగడంతో మరో మూడు వాహనాలు ప్రమాదానికి గురై ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి వైపు నుంచి తుని వైపు వెళుతున్న కారు అకస్మాత్తుగా టైరు పేలి రోడ్డుకి అడ్డంగా ఆగింది. ఆ సమయంలో వెనుక వస్తున్న మరో కారు దానిని ఢీకొంది. అదే క్రమంలో వెనుక వస్తున్న వ్యాను ప్రమాదానికి గురైన కార్లను తప్పించబోయి డివైడర్ దాటుకుని పక్క రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆక్రమంలో ఎదురుగా వచ్చిన లారీ ఆ వ్యాను ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే పాయకరావుపేట గొల్ల బాబూరావు విశాఖపట్నం వెళ్తూ అక్కడ ఆగి గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. గాయపడిన వ్యాను డ్రైవర్‌ను పోలీసు వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యాన్ డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉందని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తల్లిదండ్రులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు

దొండపర్తి: 'కొడుకు, కోడలు ఇద్దరూ.. ఇల్లు, స్థలం డాక్యుమెంట్లతో పాటు రూ.3 లక్షలు నగదు తీసుకొని తిండి పెట్టడం లేదు. కుమార్తెల దగ్గరకు పంపించేసి వాళ్లని కూడా బెదిరిస్తున్నారు'అని వెంకటాపురం ప్రాంతానికి చెందిన 79 ఏళ్ల వృద్ధుడు.. 'కొడుకు తన ఇంట్లోకి చొరబడి కత్తితో గాయపరిచి తన వద్ద ఉన్న ఇంటి పత్రాలు, ఫోన్, వాహనం, పెళ్లికాని కుమార్తె కోసం ఉంచిన రూ.40 వేలు నగదు తీసుకొని వెళ్లిపోయాడు'అంటూ ఆరిలోవకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు.. ఇలా నలుగురు వృద్ధులు తమ పిల్లలు పెడుతున్న చిత్రహింసలపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 56 ఫిర్యాదులు రాగా.. ఇందులో నలుగురు వృద్ధులు తమను కుటుంబ సభ్యులు వేధిస్తున్నారంటూ సీపీకి విన్నవించారు. ఈ ఫిర్యాదులపై సీపీ స్పందిస్తూ వృద్ధులను ఇబ్బందులు పెడుతున్న కుటుంబ సభ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి రామకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- ప్రధాన రహదారుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు
- అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు వెల్లడి



మాడుగుల పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు తదితరులు

మాడుగుల: అక్రమ గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించడంతో చాలా వరకు గంజాయి రవాణాను నియంత్రించడం జరిగిందని, అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజు అన్నారు. సోమవారం సాయంకాలం మాడుగుల పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విశాఖ మన్యం నుంచి తరలించే గంజాయికి అడ్డు కట్టవేయడానికి నర్సీపట్నం, మాడుగుల ప్రధాన రహదారుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిఘా ప్రాంతాల్లో మొబైల్ బృందాలు తిరుగుతున్నందున గంజాయి కేసులు తగ్గాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గంజాయి కేసులు తగ్గాయన్నారు. అలాగే సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి పాల్పడితే వెంటనే, దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించడంతో పాటు, 1902కు కాల్ చేయాలన్నారు. అలాగే దిశ యాప్‌ను ప్రతి మహిళ సెల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ యాప్‌లో ఎస్ఓఎస్ సిస్టమ్ ఉన్నందున సంఘటనా ప్రదేశాన్ని వెంటనే గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్. తాతారావు ఎస్ఐ దామోదరనాయుడు, సిబ్బంది ఉన్నారు.

క్విజ్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



విజయం సాధించిన విద్యార్థులు

పాయకరావుపేట: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, కాపులుప్పాడ, విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన సౌత్ రీజియన్ భారత్ కో జానో క్విజ్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అజితేష్ త్రిపాఠీ (8వ తరగతి), కామిరెడ్డి గణేష్ పార్థు (7వ తరగతి) ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. భారతదేశ పురాతన, ఆధునిక వైభవం, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలు, వర్తమాన వ్యవహారాలు.. అనే అంశాలపై నిర్వహించిన పోటీల్లో దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి ప్రాంత స్థాయి విజేతలు 8 బృందాలు పాల్గొనగా తమ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం హర్షణీయమని విద్యాసంస్థల అధినేత నరసింహారావు తెలిపారు. విజేతలను విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అభినందించారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరస్కరణకు గురయ్యే అర్జీలకు వారి కిచ్చే సమాధానంలో అందుకు గల కారణాలను వివరించాలన్నారు. ప్రతి రోజూ వచ్చే స్పందన అర్జీలకు వెంటనే స్పందించి సమాధానాలు ఇవ్వాలన్నారు. మొత్తం స్పందనకు 301 దరఖాస్తులు నమోదవ్వగా అధిక సంఖ్యలో భూ సంబంధిత భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి. దయానిధి, ఎస్.డి.సి ఎ.మహేష్, డ్వామా పీడీ ఇ.సందీప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

నక్కపల్లి: మండలంలో డీఎల్‌పురం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ స్కూల్ కమిటీ చైర్మన్ ప్రసాదుల శ్రీను సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టికి వినతి పత్రం ఇచ్చారు. పదోతరగతి పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో సబ్జెక్ట్ టీచర్లు లేక ఇబ్బందిగా ఉందన్నారు. తక్షణమే ఈ పాఠశాలల్లో బదిలీ అయిన వారి స్థానంలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు శ్రీను తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 37 అర్జీలు

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 37 అర్జీలు వచ్చాయి. జిల్లా అదనపు(పరిపాలన) ఎస్పీ బి.విజయభాస్కర్ అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో వాటిపై దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు అధికంగా వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ పైడపు నాయుడు, ఎస్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగించేవి నాటికలు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
- ముగిసిన వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్




నాటికలోని ఓ ఘట్టం

బీచ్‌రోడ్డు: నేటి బాలలకు అలనాటి కథలను నాటికల రూపంలో తెలియజేసి.. మంచి, చెడును వివరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. మూడు రోజులుగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్ సోమవారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదుల్లో ఇలాంటి నాటికలను ప్రదర్శించాలన్నారు. తారస్ ట్రియో, మాల్గుడి డేస్ నాటికలు పిల్లలకు వినోదంతో పాటు సమాజం పట్ల అవగాహన పెంపొందించాయన్నారు. తెలుగు విద్యార్థుల కోసం బరిబతల రాజా నాటికను ప్రత్యేకంగా ప్రదర్శింపజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఇలాంటి ప్రదర్శనలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. భవిష్యత్‌లో థియేటర్ ఫెస్ట్‌ను మరింత ఆసక్తికరంగా కొనసాగించాలని నిర్వాహకులను సూచించారు. వీఎంఆర్డీఏ జాయింట్ సెక్రటరీ రవీంద్ర, పైడా కృష్ణ ప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

చుట్టూ ఉన్న వారి ఆనందమే మన ఆనందం

చుట్టూ ఉన్న వారు ఎలా పోయిన ఫర్వాలేదు.. మనం సుఖంగా, ఆనందంగా ఉంటే చాలు అనుకుంటే ఏదో ఓ రోజు మనల్ని ఎవరో ఒకరు మోసం చేస్తారు. ఇదే కథతో బరిబతల రాజా నాటికను హైదరాబాద్‌కు చెందిన కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఓ రాజు రాజ్యం కోసం కాకుండా కేవలం తన ఆనందం కోసం వస్త్రాలపై అధిక శ్రద్ధ చూపిస్తాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు ఆయనకు మాయమాటలు చెప్పి.. మోసం చేస్తారు. ప్రజల ముందు అవహేళనకు గురి చేస్తారు. దీంతో ఆ రాజుకు జ్ఞానోదయం అవుతుంది. మన చుట్టు ఉన్న వారు ఆనందంగా ఉంటే.. మనం కూడా ఆనందంగా ఉంటామని భావించి.. రాజ్యంలో ప్రజల సుఖసంతోషాల కోసం పనిచేస్తాడు. ఈ కథను కళాకారులు వినోదాత్మకంగా.. పిల్లలకు అర్థమైన రీతిలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే ముంబయికి చెందిన కునాల్ మోట్లింగ్, సందేశ్ సంజయ్‌లు ప్రదర్శించిన మైమ్ ప్రదర్శన చిన్నారులు, పెద్దలను విశేషంగా అలరించింది. కేవలం హావభావాలు, వ్యక్తీకరణాల ద్వారా నవ్వించడంతో పాటు మంచి సందేశమిచ్చారు.

హాస్యనటుడు సత్తిపండు జన్మదిన వేడుకలు



చీడికాడలో సత్తిపండు జన్మదిన వేడుకల్లో చిత్ర బృందం

చీడికాడ: చందమామ రావే సినిమా షూటింగ్ లొకేషన్ చీడికాడలో బుల్లితెర, సినీ హాస్య నటుడు పీలా సత్తిపండు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆడారి మూర్తిసాయి దర్శకత్వంలో ఈ చిత్ర షూటింగ్ గత కొన్ని రోజులుగా చీడికాడ, పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. సోమవారం సత్తిపండు పుట్టినరోజు కావడంతో సహ నటులు, అభిమానుల సమక్షంలో వేడుకలు జరిపారు. సత్తిపండు బుల్లితెర హాస్య నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకుని, ఇపుడు సినిమాల్లోనూ నటించి, అందరినీ ఆకట్టుకుంటున్నాడని, సినీ పరిశ్రమలో ఆయన మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. చిత్ర నిర్మాత ఎం.ఎ స్.మూర్తి, హీరోయిన్లు సంహిత, సోనిరెడ్డి, హీరో సాయికిరణ్, టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర, నటులు అప్పారావు, ఎఫ్ఎం బాబాయ్, శృతి, జ్యోత్స్న, రాజీవ్, దిలీప్, వాసు, పిట్ల రాజు, గోల్డ్ వాసు, డీవోపీ ఆర్కే, యూ ట్యూబర్ మహీధర్, అసిస్టెంట్ డైరక్టర్లు లాలె ప్రసాద్, భీమరశెట్టి త్రినాథ్‌కుమార్, ఎస్.భానుచందర్ పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు



కశింకోట వద్ద లారీలో తరలిస్తున్న పశువులను పట్టుకున్న పోలీసులు

కశింకోట: కశింకోట వద్ద సోమవారం వేకువజామున లారీలో అక్రమంగా తరలిస్తున్న 36 ఆవు జాతి పశువులను పట్టుకున్నట్టు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు మాటు వేసి విజయనగరం జిల్లా మానాపురం నుంచి హైదరాబాద్‌కు లారీలో తరలిస్తున్న పశువులను స్థానిక పడమటమ్మ ముఖ ద్వారం వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిని సబ్బవరం వద్ద హెల్పింగ్ హాండ్స్ సొసైటీ వారికి అప్పగించామన్నారు. విజయవాడకు చెందిన లారీ డ్రైవర్ నాయుడు రామారావును అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులకు పసుపు కొమ్ములతో పూజ



అనకాపల్లిటౌన్: స్థానిక లక్ష్మీదేవిపేట శ్రీ గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవాన్ని డిసెంబర్ 9న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు ముప్పన జ్యోతి, పడాల పుష్ప, దేశెట్టి వెంకటరావు, జామి అచ్చియ్యమ్మలు తెలిపారు. కార్తీక సోమవారం పురస్కరించుకుని అమ్మవారికి 51 కేజీల పసుపు కొమ్ములు, కుంకుమతో ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవిపేటలో ఇంటింటికీ వెళ్లి అమ్మవారి పసుపు, కుంకుమలను అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి కార్తీక పూజలు

కశింకోట: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వారికి చందనాన్ని పూసి, సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు, డీపీఎన్ హైస్కూల్, గవరపేట, వెలంపేటల్లో కార్తీక మాసం సందర్భంగా నెలకొల్పిన గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను భక్తులు ఎక్కువగా దర్శించి పూజలు నిర్వహించారు.

పెరిగిన టమాటా ధర

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర మళ్లీ పెరిగింది. నెల రోజులుగా స్థిరంగా ఉన్న టమాటా ఇప్పుడు కిలోకి రూ.10 పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి చేరింది. బంగాళా దుంప, దొండకాయ రూ.30, ఉల్లిపాయ రూ.40, బెండకాయ, వంకాయ, బీట్రూట్, క్యారెట్, కాకరకాయ రూ.60, చిక్కుడు, బీరకాయ రూ.80, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన



వలస కార్మికులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్

కశింకోట: వలస కార్మికులు ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా, అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ సూచించారు. మండలంలోని తాళ్లపాలెం చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమలో 48 మంది వలస కార్మికులకు ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు యాక్సెప్ట్ ఎన్‌జీవో, సీడ్ మొబైల్ ఐసీటీసీల ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు జరిపారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా సోకుతుందో వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాక్సెప్ట్ ఎన్‌జీవో ప్రాజెక్టు మేనేజర్ గండుపల్లి ఢిల్లేశ్వరి, పరిశ్రమ ఏజీఎం, హెచ్ఆర్ ఎం.నరసింహరాజు, ఎల్‌టీ కె.కిషోర్‌కుమార్, యాక్సెప్ట్ సంస్థ ప్రతినిధి జె.వెంకటమోహన్, కౌన్సిలర్ ఆర్.కాంచన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి సాంబమూర్తి శూలాల మహోత్సవం



శూలాలు ధరించిన భక్తుడు

కశింకోట: మండలంలోని బంగారయ్యపేటలో వెలసిన చౌడేశ్వరి సమేత సాంబమూర్తి శూలాల మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం రెండో సోమవారం పురస్కరించుకుని నిర్వహించిన ఉత్సవం సందర్భంగా పలువురు భక్తులు గంప శూలాలు, సాంబశివుని శూలం, బుగ్గ శూలాలు తదితర వాటిని ధరించి, ఆలయం నుంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు అర్ధరాత్రి వరకు సాగింది. ఉత్సవం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని, స్వామివార్లను దర్శించుకున్నారు. ఎంపీటీసీ సభ్యులు ఇందల హేమలత, అద్దంకి సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇందలి ముసిలినాయుడు, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఆంధ్ర ప్రసాద్, చిన్ని రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



అక్కచెల్లెమ్మలకు.. జగనన్న ఆసరా



ఆసరా పథకం గురించి డ్వాక్రా మహిళలకు అవగాహన

అనకాపల్లి మండలం, జోన్ పరిధిలో రూ.70 కోట్ల లబ్ధి

నాలుగు విడతల్లో ఇప్పటికే మూడు విడతలు చెల్లింపు

వచ్చే ఏడాది జనవరిలో తుది విడత చెల్లింపులు

డ్వాక్రా రుణ బాధల నుంచి విముక్తి

ఎన్నికల హామీ నెరవేర్చిన సీఎం జగన్

నవ రత్నాలు అమలులో భాగంగా గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన, ఉత్పాదకత పెంపునకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వంలో స్వయం సహాయక బృందా (డ్వాక్రా సంఘా)లు తీసుకున్న రుణ బకాయిల(లోన్ అవుట్‌స్టాండింగ్) మొత్తాన్ని నాలుగు వాయిదాల్లో రీయింబర్స్ చేయాలని సంకల్పించారు. ఇప్పటికే మూడు వాయిదాలు చెల్లించేశారు. నాలుగో వాయిదాను కూడా రానున్న జనవరిలో చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అనకాపల్లి మండలం, జోన్ పరిధిలో ఆసరా లబ్ధి	విడత	సంఘాలు		లబ్ధిదారులు		లబ్ధి(రూ.కోట్లలో)	
		మండలం	జోన్	మండలం	జోన్	మండలం	జోన్
	మొదటి విడత	1,859	1,196	19,454	11,301	13.91	8.99
	రెండవ విడత	1,863	1,206	19,478	11,316	13.99	9.19
	మూడవ విడత	1,863	1,218	19,478	11,472	13.92	10.02



నా పేరు బొండా వరలక్ష్మి. అక్కిరెడ్డిపాలెం. నా భర్త వ్యవసాయ కూలీ. మాకు ఇద్దరు పిల్లలు. మరిడిమాంబ గ్రూపులో 2016లో రూ.10 లక్షల రుణం ఇచ్చారు. నా వంతుగా రూ.80 వేలు రుణం అందింది. కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న అప్పు కట్టలేక చాలా ఇబ్బందులు పడ్డాం. గత ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీ మేరకు మా రుణం మాఫీ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఏటా నేరుగా నా బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు జమ చేస్తున్నారు. మూడు విడతల్లో రూ.60 వేలు లబ్ధి చేకూరింది. దీంతో పాటు వైఎస్సార్ చేయూత నగదు కలిపి, రెండు ఆవుల్ని కొనుక్కున్నా. వాటితోనే ఇపుడు మా జీవనం గడుస్తోంది. జగనన్న చేసిన మేలు మా జీవితాలకు చాలా ఊరటనిచ్చింది.



నా పేరు రావి జయలక్ష్మి. మాకవరం గ్రామంలో భర్త, పిల్లలతో ఉంటున్నాము. మా ఊర్లోని శ్రీ ఆంజనేయ డ్వాక్రా సంఘంలో నేనూ ఓ సభ్యురాలిని. గత ప్రభుత్వంలో డ్వాక్రా ద్వారా వచ్చిన రుణంలో రూ.70 వేలు నేను తీసుకున్నాను. గతంలో బ్యాంకుల నుంచి ఎక్కువ ఒత్తిడి ఉండేది. జగనన్న హామీతో తీసుకున్న రుణంపై చింత తొలగింది. మూడు విడతలుగా, విడతకు రూ.14 వేలు చొప్పున రూ.42 వేలు నా బ్యాంకు ఖాతాలో వేశారు. మా ఇల్లు కొంత పాడైంది. డబ్బుల్లేక రిపేర్లు చేసుకోలేదు. జగనన్న ప్రభుత్వం ఇచ్చిన పథకాల ద్వారా వచ్చిన నగదును మా సొంతింటి నిర్మాణానికి ఉపయోగించుకున్నాం. జగనన్న అందిస్తున్న పథకాలతో మాలాంటి పేదింటి మహిళలు చాలా వరకు లాభపడ్డారు.



వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులతో సిబ్బంది

తుమ్మపాల: అనకాపల్లి మండలంలోని 1963 డ్వాక్రా సంఘాలకు చెందిన 19,787 మంది మహిళలకు, జీవీఎంసీ జోన్ పరిధిలో 1218 సంఘాల్లోని 11,472 మంది సభ్యులకు ఆసరా పథకంలో ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందింది. నాల్గవ విడత ఆసరా నిధులను వచ్చే ఏడాది జనవరిలో ప్రభుత్వం అందించనుంది. ఇప్పటి వరకు మూడు విడతల్లో అనకాపల్లి మండలం, జీవీఎంసీ జోన్ పరిధి లబ్ధి దారుల ఖాతాల్లో రూ.70.02 కోట్లు జమ అయింది.

బ్యాంకులు మినహాయించుకోకుండా చర్యలు

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న జాబితా ఆధారంగా వైఎస్సార్ ఆసరా పథకంలో అర్హులను గుర్తించారు. ఈ మేరకు ఏటా వారి ఖాతాలకే ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. ప్రభుత్వం జమ చేస్తున్న మొత్తాన్ని ఎలా ఖర్చు చేసుకోవాలో మహిళలదే తుది నిర్ణయం. పాత బాకీల కింద ఆ మొత్తాన్ని జమ చేసుకోకుండా బ్యాంకర్లతో ప్రభుత్వం మాట్లాడింది. ఒక వేళ ఆ డబ్బుతో సొంతంగా వ్యాపారం చేయాలనుకుంటే వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో పీఅండ్‌జీ, హెచ్‌యూఎల్ లాంటి బహుళ జాతి సంస్థలు కూడా ఉన్నాయి.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని పట్టణంలోని సచివాలయం-5 లక్ష్మీదేవిపేట, మండలంలో ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు గ్రామాలలో మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయాల పరిధిలో అర్హులైన లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డు, జెండా ఆవిష్కరణ, ఇంటింటికీ వెళ్లి టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య వత్యాసాలను వివరించి, సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. రాత్రికి అక్కడే పల్లెనిద్రచేసి, మరుసటిరోజు ప్రజల సమస్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరుకావాల్సిందిగా వారు కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయాలి



ఎంఈవో చిట్టిబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎస్ఏ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు

అనకాపల్లిటౌన్: సమగ్ర శిక్ష ప్రాజెక్టు అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని ఏపీ సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు ఎస్.శంకరరావు కోరారు. స్థానిక ఉడ్‌పేట ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఎంఈవో చిట్టిబాబుకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 20న సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి, వేతనాలు పెంచాలని, 62 ఏళ్ల పదవీ విరమణ వయస్సు, వేతనంతో కూడిన మెడికల్ లీవులు తదితర అంశాలను ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు కె.రామకృష్ణ, కె.వి.లక్ష్మి, ఐ.అప్పారావు, పద్మజ, శిరీష, తులసి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి



తుమ్మపాలలో మహిళకు ఆయుష్మాన్ భారత్ కార్డు అందిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాలలో సోమవారం జన జాతీయ గౌరవ దినోత్సవం, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎన్నో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్నాయన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులను పిచికారీ చేసే డ్రోన్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఎంపీపీ విల్లూరి చంద్రశేఖర్ కుమారి, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వడ్డాది భారతీ అశోక్, చదరం నాగేశ్వరరావు, దంతులూరి కళ్యాణ్‌చక్రవర్తి, పడాల గణపతి, వైస్ సర్పంచ్ చదరం చిన్న, కనుబుడ్డి శంకరరావు, వార్డు సభ్యులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధిలో ఎంపీ దంపతులు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం గౌరీ సేవా సంఘం ఆలయ ఆవరణలో అయ్యప్పస్వామిని ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డేడ రాము, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, విల్లూరి రాజేష్, త్రినాథ్, పాలమరశెట్టి సన్యాసినాయుడు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శిరిడీ సాయి మందిర వార్షికోత్సవం



రత్నాకర్‌కు సాయిబాబా చిత్రపటాన్ని ఇస్తున్న శిరిడీ సాయి మందిరం కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్: మండలంలోని కొత్తూరు పంచాయతీ ఎన్‌జీవోస్ కాలనీలోని శిరిడీ సాయి మందిరం 14వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ పార్లమెంటు పరిశీలకులు దాడి రత్నాకర్ సాయినాథుని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ వరహాలబాబు, విల్లూరి రాజశేఖర్, వరహాలరాజు, శివానంద, ఆలయ ప్రధానార్చకులు దివాకర్, బొడ్డపాటి చినరాజారావు, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మొల్లి రమణబాబు, ఇంటి త్రినాథ్, యల్లపు శ్రీనివాస్, నందవరపు కుమార్, నమ్మి శ్రీను, పెంటకోట సాగర్, పరమేష్, గణేష్, ముక్కు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు. మండల ఆటోడ్రైవర్లతో స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను, ప్రయాణికులను అనుమతించడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఓవర్ స్పీడ్‌తో ఆటోలను నడపడం, జంక్షన్ల వద్ద ముందు వాహనాలను గమనించకుండా డ్రైవింగ్ చేసి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. సమావేశంలో ఎంవీఐ శిరీష, ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరితగతిన కశింకోట-మునగపాక రోడ్డు నిర్మాణం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

కశింకోట: కశింకోట-మునగపాక గ్రామాల మధ్య పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న తారురోడ్డు పూర్తయితే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. ఈ రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద సుమారు రూ.4.3 కోట్లతో కశింకోట నుంచి పెదపాడు మీదుగా మునగపాక వరకు మట్టి రోడ్ల స్థానంలో తారు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మూడు చోట్ల వంతెనలు వెడల్పుచేసి, పునర్నిర్మాణం చేసేందుకు సీఎం జగన్ చొరవతో కేంద్రం నుంచి రూ.5.8 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పెదపాడు వరకు 3.5 కి.మీ. రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన భాగం పనులు డిసెంబర్ నెలాఖరుకు పూర్తవుతాయన్నారు. రోడ్డు పూర్తయితే కశింకోట, మునగపాక, అచ్యుతాపురం మండల ప్రజలు, రైతుల రాకపోకలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరమవుతుందన్నారు. ఎంపీ వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మునగపాక ఎంపీపీ జయలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

అనకాపల్లిటౌన్: ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటు హక్కు ఎంతో గొప్పదని, 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ కోరారు. పట్టణంలో నారాయణ, చైతన్య కళాశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కుపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని డిసెంబర్ 9 వరకూ గడువు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవంతుడు ఒక్కడే



భగవద్గీత శ్లోకాలను వివరిస్తున్న త్రినాథ్

అనకాపల్లిటౌన్: భగవంతుడు ఒక్కడే అనడానికి భగవద్గీతే ఆధారమని ఎస్‌బీఐ విశ్రాంత మేనేజర్, గీతా తత్త్వజ్ఞాన నిపుణులు ఐనాల త్రినాథ్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ పాలూరి చిదంబరం మెమోరియల్ హాల్లో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీమద్భగవద్గీతలోని నిగూఢ రహస్యాలను సరళమైన భాషలో పండితులకు, పామరులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సభ్యులు పాల్గొన్నారు.

సర్వం శివోహం

- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
- దీపారాధన, స్వయంపాక దానాల్లో మహిళలు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు



కూరగాయల మార్కెట్ సాధువుల ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండల పరిధిలోని శివాలయాలు హరహర మహాదేవ.. శంభో శంకర నామ స్మరణతో హోరెత్తాయి. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా ఊరూవాడా తొలి వేకువ నుంచే భక్తులు ఆలయాలకు దారితీశబూరు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు పలు ఆలయాల్లో స్వామివారికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, వివిధ పండ్లరసాలతోను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి, శారదానది ఒడ్డు గాంధీనగరం ఉమారామలింగేశ్వరస్వామి, చిన్నరాజుపేట సాంబశివుని ఆలయం, కూరగాయల మార్కెట్ వద్దనున్న సాధువుల ఆలయాల్లో శివలింగానికి ఆయా ఆలయాల అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.
- మండలంలోని అక్కిరెడ్డిపాలెం, శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, బవులవాడ, సీతానగరం, కొత్తూరు, వల్లూరు గ్రామాల శివాలయాల్లో ఓం నమశ్శివాయ నామ సంకీర్తనలో భక్తులు మునిగితేలారు. శివాలయాల ఆవరణలో ధ్వజస్తంభాలు, జమ్మిచెట్టు, తులసి, వేప, నేరేడు చెట్ల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు స్వయంపాక దానాలు చేశారు. ఆయా దేవాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ చైర్మన్లు తాటికొండ కాంబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, నుదుటిపాటి తాతాజీలు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. పట్టణ, మండల సీఐలు దాడి మోహన్‌రావు, రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.
- గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి ఆలయంలో బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు మాట్లాడుతూ ఏటా కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారాల్లో క్లబ్ సభ్యులు ప్రసాద వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి, రెండో సోమవారం పురస్కరించుకుని ఆలయ చైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో సాముహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని శివాలయాలు కార్తీక మాసం రెండో సోమవారంతోపాటు కార్తీక పౌర్ణమి తిథి కూడా ఉండటంతో కిటకిటలాడాయి. కశింకోటలోని శివాలయానికి భక్తులు వేకువ జాము నుంచే బారులుతీరారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

- స్థానిక గవరపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకునే భక్తులు శారదా నదిలో స్నానాలు ఆచరించి, పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.
- కస్పావీధిలోని సాంబశివుని ఆలయంలో అర్చకుడు వేయిదళంల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.
- వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, పల్లపు సోమవరం, చింతలపాలెం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం గ్రామాల్లోని శివాలయాలు, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేట బసవేశ్వరస్వామి ఆలయం, తాళ్లపాలెం సంత రామలింగేశ్వరస్వామి ఆలయం, ఏఎస్ పేట సాంబశివుని ఆలయాలకు కూడా భక్తులు భారీగా తరలివచ్చి, పూజలు చేశారు.



సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయి, సూర్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు



కశింకోటలోని శివాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు